వైభవంగా ఆర్జిత సేవలు


మాంగల్యధారణ ఘట్టంనిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. ◆ శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అదిష్టింపజేసి కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం జరిపారు. గరుడసేవ కూడా ఘనంగా నిర్వహించారు.

కనకరాజు కుటుంబానికి అండగా ఉంటాం

పెందుర్తి: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నక్కా కనకరాజు మృతిచెందిన విషయం తెలుసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విచారం వ్యక్తం చేయడంతో పాటు ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని సూచించారని రాష్ట్ర జేసీఎస్ కో ఆర్డినేటర్ హర్షవర్ధన్‌రెడ్డి చెప్పారు. అక్కిరెడ్డిపాలెంలోని కనకరాజు నివాసంలో ఆదివారం ఆయన కుటుంబ సభ్యులను అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ,ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో కలిసి పరామర్శించారు. సీఎం వైఎస్ జగన్ సూచన మేరకు కనకరాజుకుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. భవిష్యత్తులో కూడా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులను ఓదార్చారు.


కనకరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి,బొడ్డేడ, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

కనకరాజుకు ఘన నివాళి

పెందుర్తి: వైఎస్సార్‌సీపీ పెందుర్తి మండల అధ్యక్షుడు, జేసీఎస్ ఇన్‌చార్జి నక్కా కనకరాజు ఆకస్మిక మరణం తమను ఎంతో బాధించిందని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆవేదన వ్యక్తం చేశారు. సుజాతనగర్ సమీపంలోని ఆకార్ అనాథ బాలికల ఆశ్రమంలో దివంగత నక్కా కనకరాజు జ్ఞాపకార్థం అల్పాహారం అందించారు. కార్యక్రమంలో కాపు సామాజిక వర్గ ప్రతినిధులు మధుపాడ అంజి, మెంటి మహేష్, ఉగ్గిన గోవింద్, సియాద్రి అప్పలరాజు, గొరపల్లి అప్పారావు పాల్గొన్నారు.


అనాథ బాలికలతో కలిసి అల్పాహారం స్వీకరిస్తున్న ముమ్మన దేముడు

భారీ అన్నసమారాధన


గొల్లనారాయణపురంలో అన్నప్రసాదం వడ్డిస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్


అన్నసమారాధనను ప్రారంభిస్తున్న పరవాడ గ్రామ పెద్దలు

పరవాడ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక యంగ్‌మెన్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చుక్క రామునాయుడు ఆధ్వర్యంలో పరవాడ సంతబయలులో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. దీన్ని రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు తదితరులు పాల్గొన్నారు.

◆ తానాం గ్రామంలో ఆదర్శ మోటార్ ఓనర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనను అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కన్నూరు వెంకటరమణ ప్రారంభించారు.

సింహాచలం: జీవీఎంసీ 93వవార్డు గొల్లనారాయణపురంలో గణేష్ యంగ్ బాయ్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అన్న సమారాధనను ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. తొలుత అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. గణేష్ యంగ్ బాయ్స్ సోమశేఖర్,గోవింద్, జగదీష్, ప్రసాద్, ప్రేమ్,తేజ్, యాదవ సంఘం నాయకులు సింహాచలం, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ కారిడార్ రోడ్డుకు మోక్షం


కొత్తగా వేసిన బీటీ రోడ్డు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ నుంచి లంకెలపాలెం వరకు అధ్వానంగా మారిన కారిడార్ రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. దీంతో కలపాక, పిట్టవానిపాలెం, బోనంగి, దలాయిపాలెం, వాడచీపురుపల్లి, స్టీల్‌ప్లాంట్ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే కార్మికులు, ఉద్యోగులు, ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దుర్గమ్మా.. నమోస్తుతే


పంచముఖ గాయత్రీ మంగళగౌరిగా..


విజినిగిరిపాలెంలో దుర్గాదేవిగా..


సుజాతనగర్‌లో మహిషాసురమర్దినిగా ..

పెందుర్తి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు దేవాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. చినముషిడివాడ సమీపంలోని సప్తగిరినగర్‌లో కొలువుదీరిన అలివేలు మంగమ్మ చందనాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు మణిబాబు ఆధ్వర్యంలో కుంకుమ పూజలు జరిపారు.

- ◆ సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో మహిషాసురమర్దినిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.
- ◆ చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లో కొలువైన పంచముఖ గాయత్రీ అమ్మవారు మంగళగౌరిగా దర్శనమిచ్చారు.

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదోరోజు ఉమాదేవి దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

అడవివరం దరి పాతగోశాల వద్ద సింహగిరి పునరావాసుల లేఅవుట్‌లో బంగారమ్మ, పాదాలమ్మ ఆలయంలో బంగారమ్మకు సారె సమర్పణ కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు.

ఘనంగా కుంకుమ పూజ

సబ్బవరం: మల్లునాయుడుపాలెంలో ఆర్టీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆరాధ్యుల సీతా రామాంజనేయ శాస్త్రి అమ్మవారి విశిష్టతను వివరించారు.

- ◆ సబ్బవరంలో శ్రీదుర్గమాంబ అమ్మవారి ఆలయ సన్నిధిలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.
- ◆ ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి సన్నిధిలో ఆదివారం చండీ యాగం నిర్వహించారు.


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

దళితుల పక్షపాతి శంకరన్


ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

పరవాడ: దేశపాత్రునిపాలెంలో జై బుద్ధ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాజీ ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్.శంకరన్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. విదసం ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు పాల్గొని ఎస్.ఆర్.శంకరన్‌కు చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. వెంకటరావు మాట్లాడుతూ శంకరన్ ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను రూపొందించారని కొనియాడారు. టి.సత్యరాజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కె.హరిబాబు, కర్ర ప్రకాష్, పరందామయ్య పాల్గొన్నారు.